# విషపాత్ర

శ్రీ బొందలపాటి శివరామకృష్ణ

లలితా!

'..........'

'లలితా!'

'సురేశ్!' అని పుప్పొంగిపోతూ, తలుపు తీసిందొక పదునారేండ్ల తరుణి.

'ఎంతసేపట్నుంచి నుంచున్నావు సురేశ్'

'చాలా సేపట్నుంచి'

'పిలవనే లేదేం?'

'ఎట్లా పిలవగలుగుతాను, మర్త్యులకు కూడా మత్తెక్కించే సంగీత తరంగాలలో తేలిపోతూ!'

'తన ప్రశంస వినలేనట్టుగా కొంచెం తలవంచింది సిగ్గుపడుతూ.

'మంచినీళ్ళు తీసుకురానా' అన్నది కొంచెం సేపుండి.

'ఆ కొంచెం తీసుకురా, ఈ దాహాన్నార్పుకోటానికి మంచినీళ్ళుకాక మరో మందుంటుందా లలితా!' అంటూ కొంచెం విచారంగా మంచం మీదకెళ్ళి కూర్చున్నాడు. అతని ముఖంమీద చింతాఛ్ఛాయలు ఆవరించుకున్నాయి. బాల్య స్మృతులు అతని హృదయానికి భారం కలిగించాయి. ఎక్కువసేపు చింతాభారంతో కూర్చుని ఉండలేకపోయాడు. కొంచెం మేనువాల్చాడు మంచంమీద.

లలిత మంచినీళ్ళు తీసుకువచ్చి "ఇప్పుడు మాయింటివైపే తిరిగిచూడటం లేదేం సురేశ్"? అన్నది అతని చేతికందిస్తూ. కాని అతని అంతర్యంలోంచి చెలరేగివస్తున్న తుపాను విసురులను మాత్రం గుర్తించలేకపోయింది.

'మీ యింటిఛాయలనే తొక్కగూడనిరోజులొస్తున్నాయి లలితా! ఇంకా మీయింటివైపేం తొంగిచూస్తాను' అన్నాడు విచారం తొణికిసలాడుతున్న ముఖంతో.

'ఎక్కడికైనా ఉద్యోగాని కెళుతున్నావా?'

'లేదు'

'ఇంకేమిటి?'

'నీపుస్తై నా మార్గానికి ప్రతిబంధకమవుతోంది'

'పుస్తె! ఏమిటి సురేశ్! సరిగా చెప్పవు' అన్నది లలిత అతని పంచను కూర్చుంటూ ఆతురతతో.

'నీపెళ్ళి లలితా'

'నా పెళ్ళి—ఎవరన్నారు?'

'నిశ్చయించుకున్నారు'

'నా పెళ్ళి' అని మాటామంతీలేని మూగదైపోయింది. పెళ్ళిమాట వినగానే ఆమె హృదయం ఒక్కసారిగా కృంగిపోయింది. తనూ సురేశ్ చిన్నప్పట్నుంచీ ఒక్కచోట ఆడుకుని, ఒక్కపాటే ప్రేమరాగాన పాడుకున్నారు. ఇక సురేశ్ తనింటికిరాడు కామోసు. ఆ స్వాతంత్ర్యం ఇంకెందుకుంటుంది? తనపుస్తె ముడితోనే తన స్వాతంత్ర్యం కూడా బంధించబడిపోతుంది. ఇక సురేశ్ తనవాడుకాడు పరాయివాడయిపోతాడు!—యిట్లా అనేక ఆలోచనలతో తెప్పరిల్లుతూ మెదలకుండా తలవంచుకు కూర్చున్నది.

'లలితా, పెళ్ళంటే నీకు సంబరంకాదూ?' అన్నాడు సురేశ్ కొంచెం సేపుండి.

ఆమె అట్లాగే తలవంచుకుని విచారంగా కూర్చునివుంది.

'మాట్లాడవేం లలితా! సంబరంకాదూ?' అన్నాడు మళ్ళా.

'ఆ, సంబరమే' అన్నది తలవంచుకునే 'అయితే, ఇక మా ఇంటికి రావా సురేశ్?'

'ఎట్లా రాగలుగుతాను లలితా! మానవుడు స్వార్థిగదా! ఎప్పుడూ ఏదో ఒక స్వార్థాన్ని హృదయంలో పెట్టుకునే కమలంచుట్టూ తుమ్మెదల్లాగా ఝూంకారంచేస్తూ తిరుగుతూవుంటాడు, కమలమనేదే లేనిది ఇంకేటికోసం తిరుగుతాయి తుమ్మెదలు! కలువలచెంతకు అవిరావుకదా! నేనింకేస్వార్థం హృదయంలో పెట్టుకువస్తాను లలితా. నువ్వు పరాయి 'పాలవుతూంటే?' ఇక రావటం పడదు అన్నాడు చింతాదృష్టితో ఆమెకేసిచూస్తూ.

'ఇక రావటం పడదా?' అన్నది కంటనీరు కృక్కుకుని.

'దిగులుపడతావెందుకు లలితా! ఇది స్త్రీజాతి ధర్మం. పెద్దల ఆజ్ఞలను పాలించటం, ఎప్పుడో ఒకప్పుడు సంఘం చెప్పినట్లు ముడిపెట్టుకుని పతిగృహానికి వెళ్ళటం. ఆమె స్వాతంత్ర్యంగా ప్రేమించుకోటానికీ, కోర్కెలను తీర్చుకోటానికీ హక్కున్నదా? ఒకవేళ సాహసించినా సంఘం కండ్లురిమిచూస్తుంది. ఇట్లా నీవూ నేనేకాదు ఎంతమంది యువతీ యువకులు గాలిమేడలు నిర్మించుకుని సంఘం తాకిడికి తట్టుకోలేక ప్రథమరంగంలోనే తమ నికృష్టలజీవితాలను ఒలికిస్తున్నారు!

'ఆ, ఇది స్త్రీజాతిధర్మం....! దానికి హృదయమనేదివుంటేగా! పాషాణం....

'నీకేంలోటు లలితా! సంఘం నీరత్నరాసులకు పాదదాసియైపోతుంది, ఆ అద్దాలమేడలను మారుమ్రోగించే సంగీతాలమధ్య, పతి సరసనుకూర్చుని కిలకిలనవ్వుతూ, సరససల్లాపాలాడుతూంటే ఈ చింతలన్నీ ఎందుకుంటాయి లలితా!

'నేను ప్రేమించింది ఈ రత్నరాసులను కాదుగా'

'పిచ్చిపిల్లా నీవనుకుంటావు రత్నరాసులను ప్రేమించలేదని. సంఘం రత్నరాసులనే ప్రేమిస్తుంది. చూడు. ఒకప్పుడు నాకూ ధనమున్నది, సంపత్తివున్నది, గౌరమున్నది. కాని ఇప్పుడవేమీలేవు. ధనంతోపాటే గౌరవంకూడా అంతరించింది. ఇక ప్రేమ, ఆశమాత్రం హృదయాన్నంటిపెట్టుకున్నాయి. వీటినిచూచి సంఘం స్వార్థమంటుంది. నీవు యోగ్యుడవుకాదని కండ్లెర్రజేసి చూస్తుంది. నీకేం లలితా! సంఘం నిన్నందలాల కెక్కిస్తుంది. ఆదర్శపత్నియని ఆదరిస్తుంది, నీవు పెండ్లికూతురవై పతిసరసను పూలపల్లకీలో కూర్చుని అత్తవారింటికిపోతూంటే పుష్పవర్షం కురిపిస్తుంది. అస్థానానే నేనున్నా కన్నీటివర్షం తప్పదు లలితా. నీవు పతిగృహానికి రాణివై అతన్ని అంతరిక్షంలో పెట్టుకుని దాచు

కుంటావుకదూ! అక్కడ మన బాల్యస్మృతులకు స్థానమెక్కడ లలితా? ఎప్పుడైనా స్మరణచేసుకుంటావా? మనబాల్యాన్ని చెప్పు-మాట్లాడవే అని ఆమెచేయి అందుకుని ఊగించాడు. ఆమె మెదలకుండా శిలాప్రతిమలాగ కూర్చుని వుండిపోయింది.

'అది ఒకస్వప్నం! ఒకకల్పితకథ! బొమ్మలాట, నిజంగా బొమ్మలాటే! పిల్లలు ఊహాప్రపంచంలో అనేక గాలిమేడలు నిర్మించుకుంటూవుంటారు, వారికి నిశ్చయమనేదిలేదు. క్షణభంగురపు చపలచేష్టలు. కొంచెంసేపు అమ్మనీ—అవ్వనీ, పెండ్లికొడుకనీ, పెండ్లికూతురనీ కృత్రిమ సంబంధాలు కలుపుకుని కపటనాటకాలాడుతూవుంటారు. ఇంతలో ఏ అవ్వో, అమ్మో కర్రతీసుకు వచ్చేటప్పటికి ఎక్కడి సంబంధాలక్కడ తెంచుకుని, ఎవరి బొమ్మలను వారు తీసుకుని పరుగుదీస్తారు. క్షణభంగురం! జ్ఞాపకముందా లలితా! ఒకరోజున మనం బొమ్మలాట ఆడుతూండగా, పెళ్ళిచెయ్యాల్సి వచ్చింది. మన రెండుబొమ్మలూ ఒకచోటపుట్టి పెరిగినాయి, చిన్నప్పటినుండే స్నేహంగావున్నాయి. ప్రేమించుకున్నాయి, పెళ్ళి చేద్దామంటే నీవేమన్నావు? 'నీబొమ్మకు నగలా' నాణ్యాలా! ఆఖరికి ఒకపూసలదండకూడా లేదే, నాబొమ్మ మీయింటికి వచ్చి ఏమితింటుంది, నాబిడ్డను నేను భిఖారిణిని చేయలేనని హఠంచేసి పుష్పబొమ్మకే యిచ్చిచేశావే. వాటి భవిష్యత్తేమవుతుందో ఆలోచించావా!' అన్నాడు తన బాల్యాన్నొకసారి స్మరణకు తెచ్చుకుంటూ.

'చాలు ఊరుకో సురేశ్! నాహృదయాన్నింకెక్కువ గాయపర్చకు' అని పొంగుకొస్తున్న కన్నీటిని పయుటచెంగుతో తుడుచుకుంటూ లోపటికిపోయింది.

సురేశ్ కొంచెంసేపటివరకూ విచారంతో మెదలకుండా కూర్చుని వున్నాడు. అతని అంతర్యంలో అనేక విచారాలు సంఘర్షించుకున్నాయి. ఇంతలో లోపలినుండి వెక్కి వెక్కి ఏడుస్తున్న శబ్దం వినవచ్చింది. పిచ్చిపిల్ల తనవలెనే లోకం కూడాసరళమనీ నిర్మలమనీ అనుకుంటుంది. కాని ఈలోకంలోవుండే కుటిలాన్ని గ్రహించలేదు' అనుకుని అడుగులో అడుగువేసుకుంటూ వెళ్ళాడు లోపలికి. లలిత మంచంమీద బోర్లపండుకొని వెక్కివెక్కి ఏడుస్తోంది కన్నీటి తొలకరితో దిండునంతా తడిపివేస్తూ. సురేశ్ మంచంమీద కూర్చుని 'పిచ్చిదానా, ఈ ఏడుపంతా ఎందుకు? కన్నీరు కార్చుకుంటే సంఘం దయతలుస్తుందా?' అన్నాడు ఆమె తల నిమురుతూ.

'హృదయానికి చిచ్చుముట్టుకుని, (కాదు జీవితానికే ముట్టుకుని) నిర్మించుకున్న భవంతులన్నీ కూలిపోతూంటే ఏడవక నవ్వమంటావా! ఇది నాపాలిటి పెళ్ళిగాదు సురేశ్, మృత్యుసందేశం!'

'అట్లా అనకు లలితా: ఊహలన్నీ క్రియలవుతాయా?'

'ఇంకేమనమంటావు. బజారులో ఆడుకుంటూ వుండగా నువ్వు దెబ్బతిని నన్ను బండిక్రిందనుండి ఎందుకు తప్పించావు! ఇట్లా జీవితపర్యంతం కుమిలి కుళ్ళి చావుమనేనా?'

'ఏంచేస్తాం?'

'చాలా చెయ్యవచ్చు. నా హృదయంలో మరొకరికి స్థానంలేదు సురేశ్. ఎన్నిరోజులనుండో నా హృదయమందిరంలో పెట్టుకుని ఆరాధిస్తున్న నీదివ్యమూర్తిని ఎట్లా పెకలించి పారవెయ్యమంటావు? చెప్పు, ఎట్లా పెకిలించమంటావు?' అని ఆతన్ని కౌగలించుకు ఏడ్చింది.

'అయితే, నన్నిప్పుడేమి చెయ్యమంటావు?'

'ఏమైనా చెయ్యవచ్చును, సాహసం చెయ్యి. నేనిక్కడ ఒక్కక్షణముండను, పదపోదాం, లేచి పోదాం! ఇంకా ఆలోచిస్తావెందుకు? ఇవ్వాళే, ఇప్పుడే, ఈక్షణమే లే, సురేశ్ ఈ సమాజంలో ఇంకెంతకాలం' అన్నది ఆతురతతో అతని చేతులు ఊగిస్తూ.

'ఎక్కడికి వెళ్ళేది? సంఘం ఎక్కడుండదు?'

'ఎక్కడికా, మన ప్రేమలతలను పెంచుకునే పెర్వరీభూములకి, అక్కడే మన ప్రేమలతలను హృదయ సంచితంచేసి పెంచుకోవచ్చును. లే సురేశ్, ఇంకా ఆలస్యమెందుకు? నా అనుమతి లేనిదే నాపెళ్ళి. నా శరీరం ఆత్మలమీదకూడా నాకు హక్కులేదు! పొరుగువారొచ్చి పాలించుకోవాలా? నా హృదయ సామ్రాజ్యానికి నువ్వు తప్ప ఇంకెవరధికారి చెప్పు?' అని అతని రెండు చేతులూ పట్టుకుని అతనికళ్ళల్లోకి చూచింది.

'పిచ్చిపిల్లా, ఎక్కడికి వెళ్ళేది? ఈ మానవలోకాన్ని విడచా! అక్కడే మనకు శాంతిదొరుకుతుంది. అక్కడే మన ప్రేమవాహినులు నిశ్చలంగా ప్రవహిస్తాయి. మనమీ మానవసమాజంలో ఉన్నంతవరకూ ఈ ఇక్కట్టులు తప్పవు లలితా, పోదామంటావా? వద్దు. ఈసంఘం మహామారి, పిశాచి, రాక్షసి: లేచిపోతే ఊరికే ఊరుకుంటుందా? వెంబడిస్తుంది, పీక నొక్కుతుంది, ప్రాణాలు లేకుండాచేస్తుంది. మనకీ లోకంలో ఉన్నంతవరకూ శాంతి దొరుకదు, ఈ లోకాన్ని విడిచి, సంఘాలూ. సమాజాలూ లేని మరో ఊర్ధ్వలోకానికి వెళితేతప్ప. వెళదాం, వెళదాం అని ఉబలాటపడతావుగాని సంఘం నీకాళ్ళకు బంధాలేసి ఒక్కఅడుగు ముందుకు వేయనిస్తుందా?

'నిజమే ఏమిచేయమంటావు సురేశ్? నా జీవిత నావకాలప్రవాహంలో కొట్టుకుపోతోంది, ఒకదరికి చేర్చవా? నిస్సహాయను చేస్తావా?

'ఆ, కొట్టుకుపోతోంది, చూస్తూనేఉన్నాను నిరాశాదృష్టితో, సాధనంలేనప్పుడు అంతకన్న ఇంకేమి చేయగలుగుతాను?'

'సాధనం.... లే....దా....?'

## 2

"నన్ను నలుగురిలో తలెత్తి తిరగనియ్యకుండా చేశావుగదే! నా పరువు మర్యాదలన్నీ మట్టిపాలుచేశావు, నాజాతినే కళంకపర్చావు" అంటూనే మండిపడుతూ ఇంట్లోకి వచ్చాడు లలిత తండ్రి రామస్వామి. బారెడు కోరమీసం, వట్టెపు తలగుడ్డా, చేత వంకకర్రా అతనిహోదాకు లక్షణాలు. బజారేపోతూంటే కూర్చున్నవాళ్ళు లేచి తలపాగవిప్పి వినయం చూపించటం, ఆడవాళ్ళు గాజులెక్కడకదులుతాయన్నభయంతో తలుపుని అంటిపెట్టుకునుండటం, అతని గౌరవానికి సూచకాలు. తాలూకాబోర్డులో మునసబుని పట్టీకొట్టించటం, పంచాయతీబోర్డుప్రసిడెంటవటం అతని పలుకుబడికి నమూనాలు. అతను గద్దెక్కి చిన్న చిన్న చిల్లరతగువులకు తీర్పులు చెబుతూంటే తిరుగుంటుందా! అంతహోదాగల మనిషికి తన ఏకైకపుత్రికను మామూలు కుటుంబాలలో యిచ్చి చేయటం చిన్నతనమనిపించింది. వెంకటేశానికి రెండంతస్తులమేడనీ, అతని రెండువందల ఎకరాల మాగాణి మంచిగడ్డనీ లలితను యిచ్చి చేశాడు. ధనపుమూటలు--వెంకటేశం జరత్వాన్ని కప్పిపెట్టాయి. పూలపల్లకిలెక్కి ఊరేగుతున్న

వధూవరులనుచూచీ, మీసంమీద చేయివేసి వన్నుగ్రమీద భారంతో నాట్యకత్తెల నైపుణ్యం పరికిస్తున్న రామస్వామినిచూచి 'లలిత భాగ్యమనీ, అతని సమర్థతనీ' ముక్కుమీద వేలుపెట్టుకుంది సంఘం. కాని నేడు పరిస్థితులు విషమించి లలిత పరపురుషుని కౌగలికాశపడేప్పటికి రామస్వామి వీధినేపోతూంటే 'ఇంట్లో ఈగలమోత, బైటపల్లకీలమోతా' అంటోందా సంఘమే! అతను అవమానభారంతో కృంగిపోతూ, ఆమె జీవితాన్నంతంచేసి తనజాతిమీది కళంకం తుడిచివెయ్యాలనివచ్చాడు ఉద్రేకంతో.

'ఈ కళంకం ఎట్లాపోతుంది? నీతో పోవాల్సిందే. ఒక్కగా నొక్కకూతురని, తల్లిపోయినా ఆస్థానాన్ని నేనేవహించి పెంచి పెద్దదాన్ని చేశాను. విద్యాబుద్ధులు చెప్పించాను. అద్దాలమేడల్లో పెట్టాను. నీకీదుర్బుద్ధి, ఈమచ్చ ఎట్లా మాసిపోతుంది?'

'ఏమిచేయమంటావు నాన్నా, పరిస్థితులట్లా వచ్చాయి. నేననేకవిధాల ప్రయత్నాలు చేశాను కాని ఏమీ కొనసాగిరాలేదు.

'కొనసాగి రాకపోవటమే! నీ ప్రయత్నాలే కొనసాగినై గా! ఇదేగా నీ ప్రయత్నం? మాపరువు మర్యాదలన్నీ మట్టిపాలుచెయ్యటం.'

'మానాన్న పంచాయతీబోర్డు ప్రెసిడెంటనీ. నాభర్త లక్షలకధికారియనీ. మాది రెండంతస్తుల మేడనీ గర్వపడుతూ లోకంలోని సౌఖ్యాలన్నీ నాపాలేనని ఉవ్విళ్ళూరుతుండేదాన్ని. కాని ఇవేవీ సౌఖ్యం చేకూర్చలేవని నాకిప్పుడు తెలిసివస్తోంది. విధిలేనికాలం నన్నిట్లా అధోగతిపాలు చేసింది'

'కాలంచేసిందీ! నువ్వేమీచెయ్యలేదూ? చిన్నప్పణ్ణుంచీ గారాన పెరిగింది మామూలు కుటుంబాల్లో నిర్వహించలేదని రత్నరాసులలో పెట్టానే, ఏంకొరత? చేతినిండా నౌకర్లూ....' అన్నాడు రామస్వామి ఆమెకేసి తదేకదృష్టితో చూస్తూ.

'నాకొరత లేవో ఎట్లా చెప్పమంటావు నాన్నా? నీవు నాకన్నతండ్రివై పోయావు. ఆ, నన్ను చిన్నప్పణ్ణుంచీ గారానపెంచి, పెద్దదాన్ని చేసి రత్నరాసులకు రాణిని చేశావు. చేతినిండా నౌకర్లున్నారు. పనిచేసే అవుసరంకూడాలేదు. నేను కాపురంచేసేది ఈ రత్నరాసులతో గాదుగా నాన్నా!'

'రత్నరాసులతోగాదు, రంకుమగళ్ళతో' అన్నాడు రామస్వామి ఉద్రేకంతో తనమిత్రుత్వాన్నిమరచి.

'ఆ, వాళ్ళేదిక్కయ్యారు'

లేకలేకపుట్టిన ఒక్కగా నొక్కబిడ్డనీ, తల్లిలేనిపిల్లనీ, నౌకర్లమీద నమ్మకంలేకుండా, ఆస్థానాన్ని తనేవహించి చేతులమీద పెట్టుకునిపెంచాడు లలితను రామస్వామి. ఇప్పుడతని హృదయంలోని కూతురిమీది మమత క్రూరత్వంలోకి పరిణమించింది. ఆమెకు పాలిచ్చిపెంచిన చేత్తోనే నేడు విషమిస్తున్నాడు. 'ఇప్పుడిది అవుతుంది దిక్కు' అన్నాడు విషపాత్ర చూపిస్తూ.

'అంతభాగ్యం! తండ్రిచేతులమీదుగా! ఈ శరీరాన్ని నీవు పుట్టించి పెంచావు, ఇప్పుడు నరజాతి శుద్ధికని హైన్యం చేస్తూంటే అడ్డగించేవారెవరు? దీనిమీద హక్కులన్నీ నీవేగా! కాని ఒక మాట చెప్పదలచాను నాన్నా. నన్నుకూడా లోకం వేశ్యల్లో జమకట్టిందికదూ. నేను వేశ్యనుగాదనీ, స్త్రీ ఏ పరిస్థితులవల్ల అప్రవృత్తిలోకి దిగుతుందో చెబుతున్నాను. ముందుయుగానికైనా పాఠమై వుంటుంది.

'నన్ను ధనపుమూటలతో పతిసరసను పల్లకి ఎక్కించి పంపించావు. చేతినిండా నౌకర్లూ, లోకం మతలోగిలీ.

'నేను కాపురానికి వెళ్ళిన మొదటిరోజులు నాన్నా అవి. నాప్రతి అంగంలో మానవయవ్వనం లాస్యంచేస్తోంది. హృదయంలోంచి కోర్కెలు పొంగుకొచ్చేవి. పతిబాహువుల్లో చిక్కుకొని తనివితీరా అనుభవించాలనీ ఆయనముందు ఆకర్షణగా వుండాలని, ఆయన్ని ఆనందపర్చాలనీ కొత్త కొత్త చీరలు ధరిస్తూవుండేదాన్ని. మల్లెపూల పరిమళంతో తేలిపోతూ, సంగీతతరంగాలలో మునగుతూ పురాణాల్లో నాయికల్లాగా పతిరాకకీ, కౌగలికీ, ముద్దుకీ ఎదురుచూస్తూ ప్రొద్దుపొయ్యేదాకా నిద్రపోయేదాన్నికాదు. కాని ఆయన నన్ను చూచిన దగ్గరనుంచి రాక్షసినో రక్కసినో చూచినట్లు చూస్తూ దూరదూరంగా తొలగిపొయ్యేవారు. ఆగలేక ఒకసారి చేయిపట్టుకుంటే పంజానపడ్డ లేడిలాగ వణకుతూ దీనదృక్కులతో నాకళ్ళల్లోకి చూశారు. అప్పుడు వారిచూపుల్లోవున్న వ్యధా, పరితాపం ఏమనిచెప్పను! ఆశతోనిండి నాహృదయం ఒక్కసారిగా కృంగిపోయింది. మెదలకుండా గదిలోకివెళ్ళి, పక్కమీదపడి కడుపారా ఏడ్చాను. పాపం, వారుమాత్రం ఏంచేస్తారు ఈ జరత్వంలో. నాకు సరిగా ఆయన బిడ్డ వయసు కూడాలేదే! నాస్థితిచూచి వారుకూడా పరితాపపడుతూ, భయపడుతూ ఒక్కొక్కరోజున. ఒక్కొక్కరోజునేమిటి నెలలపర్యంతం ఇంటికి వచ్చేవారుకాదు. ఈ మూడుసంవత్సరాలనుండి ఆయన సావిడివద్ద పరితాపంతోనూ నేనింటివద్ద దుఃఖంతోనూ కాపురంచేశాం. ఇంకేంచేస్తాను నాన్నా? నేనేమీ అలౌకికశక్తినిగాదుగా, నాహృదయంలోంచి పొంగుకొస్తున్న కోర్కెల నణచుకొని, కామాన్ని చంపుకునివుంటానికి, నేనూ మానవలోకంలోపుట్టాను.

'నేను చిన్నప్పుడు యిరుగుపొరుగు పిల్లలను చూచి నేనూ ఒక మాతనవుతాను, నాబిడ్డల్ని బుజ్జగించుకుంటాను,లాలించుకుంటాను, పాలించుకుంటాను అని కలలు కంటూవుండేదాన్ని. నేను కాపురానికి వచ్చి మూడు సంవత్సరాలైంది. కాని నామాతృత్వమెక్కడ మంటగలసిపోయిందినాన్నా? చెప్పు? రేగినవుద్రేకాన్నాపుకోలేక యిరుగుపొరుగు పిల్లల్ని తీసుకువచ్చి, పక్కనవేసుకుని లాలిస్తూ కపటమాతృత్వాన్ననుభవించేదాన్ని. మళ్ళా వారి పిల్లలను వారు తీసుకుపోతూంటే నామాతృత్వం ఎదురుగా నిలబడి 'గొడ్డురాలు కింత మమత ఎందుకు?' అని గేలిచేసింది. అప్పుడు నాహృదయానికి ఎంతగాయం తగిలేదో ఆలోచించావా నాన్నా?

'పతివల్ల పొందే సుఖంలేదు, బిడ్డలవల్లకలిగే ఆనందంలేదు. ఈనాలుగు గోడలమధ్య హృదయాన్నణచి పెట్టుకుని ఈగొడ్డురాలు జీవితం ఇంకెన్నాళ్ళు గడవమంటావు? నాప్రేమబంధాల్ని తెంపి, నాజీవితాధారాన్ని భగ్నం చేసి, వృద్ధమెడకు నన్ను ముడి పెడుతూంటే అతని ధనపుమూటలకు దాసియై దీవెనలవర్షం కురిపించింది సంఘం. ఇప్పుడు పరిస్థితులు విషమించేప్పటికి నేనీ సంఘానికి 'విషపాత్ర' నయ్యాను!, అంటూ చెక్కిళ్ళమీదకి జారుతున్న కన్నీటి బిందువులు పయట చెరుగుతో తుడుచుకుంటూ సోలిపోయింది లలిత.